క్లుప్తంగా

సంఘ సేవలో భాగస్వాములు కావాలి



కె.వెంకటాపురంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేష్

కోటవురట్ల: సంఘ సేవలో యువత భాగస్వాములు కావాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్ కోరారు. కె.వెంకటాపురంలోని సంతబయలు మర్రిచెట్టు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చలివేంద్రాలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసేందుకు యువత ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొల్లు శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం



కోటవురట్ల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, పాఠకులు

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పద్యాల పోటీల్లో ప్రతిభ చూపారు. గ్రంథాలయాధికారి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు ప్రత్యేక శిబిరాలు దోహదపడుతున్నాయన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటూ ఎండల్లో బయట తిరగకుండా గ్రంథాలయ సందర్శనతో కొత్త విషయాలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ రజియా బేగం, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక ఉప సర్పంచ్ ఎన్నిక నేడు

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక ఉప సర్పంచ్ ఎన్నికకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉప సర్పంచ్ పదవి ఖాళీ అవ్వడంతో ఈ ఏడాది మార్చి 27న అధికారులు గతంలో నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే వార్డు సభ్యులు ఎవరూ ఎన్నికకు హాజరు కాకపోవడంతో వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరిగి సోమవారం ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించేందుకు అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. మొత్తం 14 మంది వార్డు సభ్యులు ఈ ఎన్నికలో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

స్టూడెంట్, కమ్యూనిటీ సర్వీస్ పుస్తకావిష్కరణ

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం వెంకటాపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్ స్టూడెంట్, కమ్యూనిటీ సర్వీస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అవసరార్థం రచించిన ఈ పుస్తకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉక్కపోతతో సతమతం



గొడుగు నీడన నడుస్తున్న మహిళ

మునగపాక: మండలంలో ఆదివారం విచిత్ర వాతావరణం కనిపించింది. వాతావరణం చల్లగా ఉన్నట్లు అనిపించినా ప్రతి ఒక్కరూ ఉక్కపోతతో సతమతమయ్యారు. ఎండ తీవ్రత అంతగా లేకున్నా చెమటలు పట్టడంతో ఇబ్బందులు పడ్డారు. కొంత మంది గొడుగు, తలకు టోపీలు ధరించి రాకపోకలు సాగించడం కనిపించింది. ఎండకు వేసుకున్న దుస్తులు తడిసిపోవడంతో చిరాకుగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

నడింపల్లి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు



పొక్లెయిన్‌తో చెరువు మట్టిని లారీలోకి లోడు చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం రూరల్ : నడింపల్లి చెరువులో పట్టపగలు పొక్లెయిన్‌తో మట్టి తవ్వి లారీలతో తరలించుకుపోతున్నారు. ఆదివారం రెవెన్యూ సిబ్బందికి సెలవు కావడంతో మట్టి దొంగలు పట్టపగలే అక్రమాలకు పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఏకమై అడ్డుకొని అధికారులకు ఫిర్యాదు చేయడంతో మట్టి తవ్వకాలు అడ్డుకట్ట వేశామని వీఆర్వో తెలిపారు. అధికారులు స్పందించి మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ధన దిబ్బపై నిలువెత్తు నిర్లక్ష్యం.!

పర్యాటక రంగానికి ఎంతో ప్రాధాన్యం ఉన్న రోజులివి. మన చారిత్రక విశేషాలు, గత వైభవాలు, సంస్కృతిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అటువంటి చారిత్రక స్థలాలు సందర్శనీయ క్షేత్రాలుగా అభివృద్ధి చేయడం ప్రధానం. ముఖ్యంగా పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న అనేక స్థలాలు చెప్పుకునేందుకు ఘన చరిత్రలుగా నిలుస్తున్నప్పటికీ నేటి తరానికి చూపించడంలోనూ, తెలియజేయడంలోనూ నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. ఇలా ఎంతో విశిష్టత కలిగి అభివృద్ధికి నోచుకోని పురావస్తు స్థలాల్లో ఒకటి రాంబిల్లి మండలం కొత్తూరు పరిధిలోని ధన దిబ్బ.

– రాంబిల్లి(అచ్యుతాపురం)

- కొత్తూరులో పురావస్తు స్థలంపై శీతకన్ను
- 24 ఎకరాల విస్తీర్ణంలో సహజ అందాల నిర్వహణ గాలికి..
- అభివృద్ధి చేయాలని పర్యాటకుల విజ్ఞప్తి



ధన దిబ్బ కొండపైకి మెట్ల మార్గం



కొండపై పెరిగిపోయిన తుప్పలు, డొంకలు

వజ్రాలు తవ్వారని పేర్కొన్న స్థూప పరిసరాలు

రాంబిల్లి మండలం కొత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న ధన దిబ్బ(బుద్ధుని కొండ)కు ఎంతో విశిష్టత ఉంది. యలమంచిలి–అచ్యుతాపురం రహదారి ఆనుకొని మొదలయ్యే ఈ ధన దిబ్బ మొత్తం విస్తీర్ణం 24 ఎకరాల వరకూ ఉంటుంది. పాండవుల కొండ వరకూ వ్యాపించి ఉన్న ధన దిబ్బపై పురావస్తు శాఖ శీతకన్ను వేసింది. 1970వ దశకంలో వజ్రాలను తవ్వేందుకు ఇక్కడ కొందరు ప్రయత్నించినట్లు ప్రచారం ఉంది. ధన దిబ్బను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చాలా అవకాశాలు ఉన్నాయి. ఇందుకు పురావస్తు శాఖ పర్యాటక శాఖతో సమన్వయం చేసుకోవాలి. అచ్యుతాపురం–రాంబిల్లి మండలాల్లో వేలాది ఎకరాల్లో భూములను సెజ్ కోసం తీసుకోవడంతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని నిపుణులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నారు. ఉద్యోగ రీత్యా నివాసమున్న వారికి ఆటవిడుపు కోసం పర్యాటక స్థలాలు ఎంతైనా అవసరం. అటువంటి ధన దిబ్బ వంటి బౌద్ధ కొండలను అభివృద్ధి చేసుకోవాల్సి ఉంది.

తుప్పల్లో పర్యాటకం..

పురావస్తు శాఖ పరిధిలో ఉన్న ధన దిబ్బ చరిత్రపై ఇక్కడ పని చేస్తున్న సిబ్బందికి ఏ మాత్రం అవగాహన లేదు. కేవలం ఇద్దరు ఉద్యోగుల ఇక్కడ పని చేస్తున్నారు. ఎంటీఎస్ పద్ధతిలో పని చేస్తున్న వీరికి కనీసం పేరు, విస్తీర్ణం, సరిహద్దులు వంటి అంశాలపై కూడా అవగాహన లేకపోవడం గమనార్హం. గేటుకు కూతవేటు దూరంలో ఒక షెడ్‌లో విధులు నిర్వహిస్తూ కాలక్షేపం చేసేస్తున్నారు.

ఇక ధన దిబ్బ పరిసరాలు తుప్పలు, డొంకలతో దర్శనమిస్తున్నాయి. 24 ఎకరాల పరిధిలో ఉన్న ప్రాచీన సంపద పరిసరాలను వివరించే బోర్డులు సైతం సరిగ్గా లేవు. విలువైన పురావస్తు ప్రాంతాలను సుందరంగా తీర్చి దిద్దాల్సిన అవసరం పురావస్తు శాఖకు ఉంది. పర్యాటకుల్ని ఆకర్షించేలా హంగులు కల్పించాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధన దిబ్బ అభివృద్ధికి కృషి చేయాలని పర్యాటక ప్రియులు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

కొత్తూరు ధనదిబ్బను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే మంచిది. గతంలో ఇక్కడ వజ్రాలు దొరికేవని పురావస్తు శాఖ వారు సీజ్ చేశారు. ఈ ప్రాంతంలో నిఘా పెంచి పర్యాటకులు వసతులు కల్పిస్తే అభివృద్ధి చెందుతుంది. స్థానికులకు ఉపాధి కూడా లభిస్తుంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– ఉప్పులూరి నాయుడు, అప్పారాయుడుపాలెం

వ్యవసాయానికి 9 గంటల పాటు విద్యుత్ సరఫరాకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



గణపర్తిలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఏఈ జగదీష్

మునగపాక: వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ ఏఈ జగదీష్ తెలిపారు. వేళాపాళా లేని విద్యుత్ సరఫరాతో ఇబ్బందులు పేరిట సాక్షిలో ఆదివారం ప్రచురితమైన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. రైతుల కమతాల్లో పర్యటించిన ఆయన ప్రతి రోజూ 9 గంటల పాటు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. రైతులు, వినియోగదారులు కూడా సహకరించాలని ఆయన కోరారు. మాజీ సర్పంచ్ కర్రి రామనాగేశ్వరరావు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు వృథా.. వ్యథ!



పెదగుమ్ములూరులో సంపు నుంచి వృథాగా పోతున్న తాగునీరు

ఎస్.రాయవరం: గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంకులకు నీటి సరఫరా చేసే క్రమంలో ఆపరేటర్లు సక్రమంగా విధులు నిర్వహించడం లేదు. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. పంపు సెట్టు నుంచి సంపులకు, సంపులు నుంచి తాగునీటి ట్యాంకులకు నీటిని ఎక్కించే క్రమంలో మోటార్లు ఆన్‌చేసి అందుబాటులో లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. అసలే వేసవి.. ఆపై తాగునీటి ఎద్దడి సమస్య గ్రామాల్లో ఉంది. తిమ్మాపురం, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, సర్వసిద్ధి గ్రామాల్లో తాగునీరు ఎక్కువగా వృథాగా పోతోంది. ఆదివారం పెదగుమ్ములూరు గ్రామంలో ట్యాంకు వద్ద సంపు నుంచి తాగునీరు వృథాగా రోడ్డుపై ప్రవహిస్తుండడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని కోరారు.

ఆగస్టు 15న 'ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పరిషత్'



మాట్లాడుతున్న గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు శ్రీకాంత్

మునగపాక: మునగపాకలో ఆగస్టు 15న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పరిషత్ నిర్వహించనునట్టు గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏటా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాకారులను ప్రోత్సహించేందుకు నాటిక పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ ఏడాది తెలుగు రాష్ట్రాల పరిధిలో నాటిక పరిషత్ నిర్వహించేందుకు కార్యవర్గం నిర్ణయించిందన్నారు. పరిషత్ విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో యువజన మందిరం ప్రత్యేక ఆహ్వానితులు సూరిశెట్టి రాము, నాటక రంగ దర్శకుడు దాడి ముసిలినాయుడు, యువ రచయిత ఆడారి సోమశేఖర్, కార్యవర్గ సభ్యులు మళ్ల జోగారావు, మళ్ల రామజోగినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పూడిమడక తీరంలో ఉత్సాహంగా మారథాన్



మారథాన్‌లో పాల్గొన్న క్రీడాకారులు

అచ్యుతాపురం రూరల్ : మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు ఎంటీఆర్‌వై హిందుస్థాన్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.తులసీరావు ఆధ్వర్యంలో పూడిమడక తీరంలో ఆదివారం మారథాన్ నిర్వహించారు. పూడిమడక తీరం నుంచి సీతపాలెం తీరం వరకూ సుమారు 30 మంది యువతీ, యువకులు మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసీరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. అనంతరం మారథాన్‌లో విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ కృష్ణ, వీఆర్ సమ్మర్ క్యాంప్ రగ్బీ కోచ్ వెంకట్, సుబ్బు, నరేష్, నిర్వాహకులు అరుణ్ కుమార్, అప్పలరాజు పాల్గొన్నారు.

సెజ్ వాహనాలు మడుతూరు నుంచి మళ్లింపు

అచ్యుతాపురం రూరల్ : సెజ్ పరిశ్రమలకు వెళ్లే వాహనాలను మడుతూరు నుంచి మళ్లించేలా ప్రణాళికలు రూపొందించాలని యలమంచిలి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సెజ్ డిప్యూటీ జోనల్ మేనేజర్‌కు సూచించారు. ఆదివారం మడుతూరు గ్రామంలో ఆయన పర్యటించారు. సెజ్ కర్మాగారాలకు వెళ్లే వాహనాలు మడుతూరు గ్రామం మీదుగా మళ్లిస్తే అచ్యుతాపురం కూడలిలో ట్రాఫిక్ సమస్య తగ్గుముఖం పడుతుందన్నారు. అంతే కాకుండా మడుతూరు గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వండి



వెంకటనగరంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్‌ఐ రత్నశేఖర్

పాయకరావుపేట: తీర ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల సమచారాన్ని మెరైన్ పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని పెంటకోట మెరైన్ పోలీసు ఎస్‌ఐ డి.రత్నశేఖర్ కోరారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా ఆయన వెంకటనగరం గ్రామంలో ఆదివారం మత్స్యకారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతం ద్వారా తీవ్రవాదులు, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని మత్స్యకారులు గమనించాలన్నారు. అనుమానాస్పద బోట్లు, వ్యక్తులు సంచరించినా, నిషేధిత మాదక ద్రవ్యాలు, వస్తువులు గానీ సముద్రం ద్వారా తీర ప్రాంతాలకు చేరవేసినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం



వెంకన్న ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న మహేష్

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మునగపాకకు చెందిన పెంటకోట మహేష్ తనవంతు సాయంగా ఆలయ నిర్మాణానికి రూ.10,116 నగదును విరాళంగా అందజేశారు. కమిటీ సభ్యులు దాడి ముసిలినాయుడు, కోనపల్లి రామ్మోహనరావు, వెలగా శ్రీనివాసరావు, ఆడారి కాశీ బాబు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా రిసోర్స్ పర్సన్ జి.సన్యాసినాయుడు విద్యార్థులకు యోగాసనాల ఆవశ్యకతను వివరించారు. క్రమం తప్పకుండా యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. చాలా మందికి యోగా, మెడిటేషన్ ప్రాధాన్యత తెలియక నేర్చుకోవడం లేదన్నారు. దైనందిక జీవితంలో నిత్యం ఒత్తిడికి గురవ్వడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. మానసిక, శారీరక ప్రశాంతత అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న బోర్డ్ డైరెక్టర్ ఎ.జె.స్టాలిన్

అచ్యుతాపురం రూరల్ : బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ పని చేస్తుందని బ్రాంచి ఇన్‌చార్జి డైరెక్టర్ ఎ.జె.స్టాలిన్ అన్నారు. ఆదివారం ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ వార్షికోత్సవం అచ్యుతాపురంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ఖాతా ఉన్న ప్రతి ఒక్కరికీ అర్హతను బట్టి రుణాలిస్తూ ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం బ్యాంక్ దినదినాభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో ఎం.వి.గణేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.రామకృష్ణారావు, జోనల్ మేనేజర్ ఆర్.తిరుమలరావు, బ్రాంచ్ మేనేజర్ ఆర్.ఉమా, అధిక సంఖ్యలో బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి



గుర్రాలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రావికమతం: కొండ శిఖర గ్రామాల్లో నివాసం ఉంటున్న తమకు స్థానికంగా ఉపాధి పనులు కల్పించాలని గిరిజనులు ఆదివారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు.

మండలంలో చీమలపాడు పంచాయతీ కొండ శిఖర గ్రామాలైన నేరేడుబంద, జీలుగులోవ, సోంపురం బందలు గ్రామాల్లో 160 మంది గిరిజనులు నివాసం ఉంటున్నారు. వీరు కొండపోడు, సామలు, పసుపు, జీడి, అల్లం పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మాకు ఉపాధి పని కార్డులు ఉన్నా ఉపాధి పనులు లేవని, ఉపాధి పనులు కావాలంటే పది కిలోమీటర్ల దూరం గల గ్రామాల్లోకి వెళ్లి ఉపాధి పనులు చేయాలని అధికారులు చెబుతున్నారని తెలిపారు. సరైన రహదారి లేదు.. పది కిలోమీటర్లు దూరం వెళ్లి రావాలంటే చాలా ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు. తమ గ్రామాల్లో ఫారెస్టు పట్టా భూ గ్రామాల్లో సరైన ఉపాధి లేక కూలి పనులు నిమిత్తం గ్రామాలు విడిచి వలసలు పోతున్నారని, దీనివల్ల పిల్లలకు చదువులు లేకుండా పోతున్నాయిని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.

25న ఏపీయూడబ్ల్యూజే శిక్షణ తరగతులు

గొలుగొండ : యూనియన్ బలోపేతానికి కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు సిహెచ్.బి.ఎల్. స్వామి సూచించారు. నర్సీ పట్నం కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సభ్యులు సూచించిన అంశాలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ నెల 25న యూనియన్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. యూనియన్ సభ్యులు అందరూ హాజరై శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సకిరెడ్డి నానాజీ, బేరా చినబాబు అలియాస్ బాబ్జి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు విజయ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కాలీఫ్లవర్ సాగు..ఆదాయం బాగు



ములగపూడిలో సాగు చేస్తున్న కాలీఫ్లవర్ తోట



తోటలో ఏపుగా పెరిగిన కాలీఫ్లవర్ పువ్వు

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందుతున్న రైతులు
- ఒకప్పుడు ఏజెన్సీకే పరిమితమైన కాలీఫ్లవర్ సాగు
- నేడు మైదానంలో విస్తారంగా పంట

నాతవరం: ఒకప్పుడు ఏజెన్సీ ప్రాంతాల్లో సాగు చేసే కాలీఫ్లవర్ పంట ఇప్పుడు మైదానం ప్రాంతాల్లో రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే ప్రస్తుతం కాలీ ఫ్లవర్ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు. మండలంలో ములగపూడి, బెన్నవరం మాధవనగం గ్రామాల్లో వ్యవసాయ బోర్ల సాయంతో సాగు చేస్తున్నారు. మండలానికి సరిహద్దు గ్రామాలైన నర్సీపట్నం మండలం శివారు ప్రాంతమైన మెట్టపాలెం, కసిరెడ్డిపాలెం, అప్పన్నపాలెం గ్రామాల్లో కాయగూరలతో పాటు కాలీఫ్లవర్ పంటలు సాగు చేస్తున్నారు. రెండేళ్లుగా ఇక్కడ రైతులు కాలీఫ్లవర్ పంట సాగు చేస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ బోర్ల ఏర్పాటు చేయడం, 9 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో క్యాలీఫ్లవర్ తోటలు సాగుకు అన్ని విధాలుగా బాగుంటుంది. ఒక ఎకరంలో వేసిన కాలీఫ్లవర్ పంట ద్వారా మార్కెట్లో రేట్లు గిరాకీని బట్టి ఏడాదికి లక్ష రూపాయలు వస్తుందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడి కష్టపడే రైతులకు అయితే కేవలం రూ.20వేలు ఖర్చు అవుతుందని లేకుంటే అదనంగా మరో రూ. 10వేలు ఖర్చు అవుతుందన్నారు. ఇతర పంటలతో పోల్చుకుంటే పెట్టుబడి తక్కువ అధిక ఆదాయం వస్తుందంటున్నారు. ఈ ఏడాది ఆయా గ్రామాల్లో రైతులు కాలీఫ్లవర్ సాగుపై దృష్టి సారించారు.

జ్ఞాపకాల పరిమళం.. స్నేహ సమ్మేళనం



ఎం.జగన్నాథపురం గ్రామంలో సందడి చేసిన పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం: దశాబ్దాల స్నేహ సుగంధం పరిమళించింది. అచ్యుతాపురం మండలం ఎం.జగన్నాథపురం ఉన్నత పాఠశాలలో 1999–2004 మధ్య చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో సందడి సాగింది. ముందుగా ఇటీవల కాలంలో మృతి చెందిన తమ బ్యాచ్ మిత్రులకు నివాళులర్పించారు. అనంతరం సరస్వతీ దేవి విగ్రహానికి పూల మాల వేసి, పూజలు చేశార. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. మిత్రులు ఒకరికొకరు పలకరించుకుంటూ చిననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కృష్ణవేణి, క్రాంతి, చిట్టి, లక్ష్మీ, అరుణ, వేణు, చిరంజీవి, శ్రీను, నాగేశ్, రమేశ్, కాసు, లక్ష్మణ్, సూకేశ్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.



గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన 1993-96 బీఏ విద్యార్థులు

యలమంచిలి రూరల్: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1993–1996 బీఏ డిగ్రీ బ్యాచ్ విద్యార్థులంతా కలిసి అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఈ కార్యక్రమానికి హాజరై సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్‌ను సత్కరించారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని పూర్వ విద్యార్థులంతా చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్రి జానకిరాం, రామారావు(సోమలింగపాలెం), నాగమణి తదితరులు పాల్గొన్నారు.